సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



ఆహ్లాదకరం.. పర్యాటకం

ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం పర్యాటక ప్రాంతాల సందర్శన ఓ ప్రత్యామ్నాయం. ఉమ్మడి పశ్చిమలోని పర్యాటక ప్రాంతాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. 8లో ▸



పిడుగుపాటుకు ఇద్దరు మృతి

లింగపాలెం మండలంలోని పాశ్యానగరంలో పిడుగుపడి ఇద్దరు కూలీలు మృతిచెందాడు. చెట్టు కింద ఉన్న వారిపై పిడుగుపడడంతో ప్రాణాలు కోల్పోయారు. 8లో ▸



స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

స్కూల్ గేమ్స్ అండర్-19 జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఏలూరులోని సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. 8లో ▸

న్యూస్‌రీల్

జస్టిస్ శేషసాయిని మర్యాద పూర్వకంగా కలిసిన జేసీ



హైకోర్ట్ జడ్జి జస్టిస్ ఏవీ శేషసాయికి మొక్కను అందజేస్తున్న జేసీ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఏవీ శేషసాయి మంగళవారం ఏలూరు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సి.పురుషోత్తం కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఏలూరు ప్రభుత్వ అతిథి గృహంలో జస్టిస్ ఏవీ శేషసాయిని కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

మద్దిలో ముగిసిన పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాల్లో భాగంగా మహాపూర్ణాహుతి నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు, పవిత్ర విసర్జన, మహదాశీర్వచనం, మహాపూర్ణాహుతి, దీక్ష విసర్జన, పండిత సత్కారం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. పవిత్రోత్సవాల్లో భాగంగా నిలిపి వేసిన గర్భాలయ దర్శనాన్ని ఉదయం 10.30 గంటల నుంచి తిరిగి గర్భాలయ దర్శనానికి భక్తులకు అనుమతి కల్పించారు. ఆదాయం రూ1,15,396 వచ్చినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. లింగపాలెంకు చెందిన ఎం.తరుణ్ కుమారి బృందం సభ్యులచే సుందరకాండ పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పర్యవేక్షకులు కురగంటి రంగారావు, జవ్వాది కృష్ణలు పాల్గొన్నారు.

విజ్జేశ్వరం, ధవళేశ్వరం మీదుగా రాజమండ్రికి బస్సులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గోదావరిపై ఉన్న రోడ్డు కం రైల్వే బ్రిడ్జికు రిపేర్ల నిమిత్తం ఈ నెల 27 నుంచి అక్టోబర్ 26 వరకు మూసివేస్తున్నందున తాడేపల్లిగూడెం నుంచి రాజమండ్రి వెళ్ళే ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు విజ్జేశ్వరం, ధవళేశ్వరం మీదుగా నడపనున్నట్లు తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి వెల్లడించారు. ప్రయాణికులు మార్పును గుమనించాలని కోరారు.

జాబ్ మేళాలో 38 మంది ఎంపిక



జాబ్ మేళా ప్రారంభంలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు

ఏలూరు (టూటౌన్): ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని సెట్‌వెల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 38 ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా ఉపాధి కార్యాలయం, నేషనల్ కెరీర్ సర్వీసు, ఏపి ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, ఎల్ఐసి, మోహన్ స్పిన్ టెక్స్ కంపెనీల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్ మేళాలో మొత్తం 95 మంది హాజరైనట్లు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు, సెట్‌వెల్ సీఈఓ మెహరాజ్ తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్ కంపెనీకి 35 మంది హాజరుకాగా వీరిలో 11 మందిని ఎంపిక చేశారు. ఎల్ఐసికి 12 మంది, మోహన్ స్పిన్ టెక్స్ కంపెనీకి 15 మంది ఎంపికయ్యారు.

నేరాలకు దూరంగా ఉండాలి

ఏలూరు టౌన్: జైలు జీవితంలో పరివర్తన చెంది నేరాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి అన్నారు. ఏలూరులోని జిల్లా జైలును మంగళవారం ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులో భద్రతాపరమైన అంశాలు పరిశీలించారు. జిల్లా జైలు ప్రాంగణాన్ని తనిఖీ చేసి, సీసీ కెమెరాల పనితీరును, సమాచార వ్యవస్థ ఏ విధంగా ఉందో పరిశీలించారు. జైలు గోడ ఎత్తు పెంచాలని అధికారులకు సూచించారు. జైలులో రికార్డు తనిఖీ చేశారు. జిల్లా జైలులో భద్రతాపరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.

ఐదో విడత వాహన మిత్ర

- ఈ ఏడాది 19,058 మంది లబ్ధిదారుల గుర్తింపు
- 29న రూ.19.58 కోట్ల జమ
- ఉమ్మడి జిల్లాలో గత నాలుగు విడతల్లో రూ.72.41 కోట్ల లబ్ధి



ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర రవాణా రంగంలో వైఎస్సార్ వాహనమిత్ర పథకాన్ని ఒక విప్లవంగా చెప్పుకోవచ్చు. ఉపాధి కోసం ప్రభుత్వంపై ఆధార పడకుండా, ఆటో నడుపుకునే ఎంతోమంది సోదరులకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన ఈ పథకంతో ఎంతోమంది ఆటో డ్రైవర్ల కుటుంబాలకు లబ్ధి చేకూర్చింది. ఆటో డ్రైవర్లకు ఆటోల నిర్వహణ, ఇతర ఖర్చుల వల్ల సరైన ఆదాయం లేకుండా పోయింది. కొంతమంది నిద్రాహారాలు మానుకుని కుటుంబ పోషణ నిమిత్తం ఆటోలు, ట్యాక్సీలు, మ్యాక్సీ క్యాబ్‌లు తిప్పుకున్నా ఆశించిన ఆదాయం రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అలాంటి వారికి చన్నీళ్లకు వేన్నీళ్లు అన్న చందంగా ట్యాక్సులు కట్టుకోవడానికి, బీమాలు చెల్లించుకోవడానికి, చిన్న చిన్న మరమ్మతులు చేయించుకోవడానికి ఉపయోగపడేలా ముఖ్యమంత్రి ఈ పథకాన్ని 2019వ సంవత్సరంలో ప్రారంభించారు. ఈ పథకాన్ని తొలిసారి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం ఏలూరులో ప్రారంభించడంతో అప్పట్లో ఆటో డ్రైవర్లు సంబరాలు చేసుకున్నారు.

ఈ ఏడాది 19,058 మంది గుర్తింపు

ఈ పథకాన్ని ప్రారంభించిన అనంతరం ఇప్పటి వరకూ వరుసగా నాలుగు సంవత్సరాల పాటు ఆటో డ్రైవర్లకు ప్రతి ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం చేసిన ముఖ్యమంత్రి ఐదో ఏట కూడా ఈ పథకాన్ని కొనసాగించడానికి చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ అధికారులకు గతంలోనే ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అర్హులైన ఆటో డ్రైవర్ల నుంచి దరఖాస్తులను రవాణా శాఖ అధికారులు ఆహ్వానించారు. ఏలూరు జిల్లా నుంచి గ్రామ సచివాలయాలు/వార్డు సచివాలయాల నుంచి మొత్తం 11,197 మంది ఆటో డ్రైవర్ల నుంచి దరఖాస్తులు అందగా వాటిని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల వద్ద ధృవీకరించుకుని 10,490 మందిని ఎంపిక చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 8,568 మందిని ఈ పథకానికి అర్హులుగా గుర్తించారు. ఏలూరు జిల్లాలో డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటులో లేకపోవడం, విద్యుత్ బిల్లు 300 యూనిట్లకు మించిపోవడం, పాత వాహన యజమానులు ఆటో రిక్షాలు/ మోటారు క్యాబ్‌లను కొనుగోలుదారులకు బదిలీ చేయడం వంటి కారణాలతో 707 దరఖాస్తులు తిరస్కరించారు.

నాలుగు విడతల్లో 72,419 మందికి లబ్ధి

వైఎస్ఆర్ వాహన మిత్ర పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఆటో డ్రైవర్లకు రూ. 19.05 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూరనుంది. ఏలూరు జిల్లాలో 10,490 మందికి రూ. 10.49 కోట్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో 8,568 మంది డ్రైవర్లకు రూ.8.56 కోట్లు ఈ పథకం కింద జమ చేయనున్నారు. ఈ పథకం కింద 2019 సంవత్సరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో 17,101 మందికి రూ. 17.10 కోట్లు, 2020లో 19,521 మందికి రూ.19.52 కోట్లు, 2021లో 17612 మందికి రూ.17.61 కోట్లను జమ చేయగా 2022లో 18,185 మందికి రూ.18.18 కోట్ల లబ్ధి చేకూరింది.

పారదర్శకంగా అమలు



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ వాహన మిత్ర పథకాన్ని ఏలూరు జిల్లాలో అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్నాం. ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల నుంచి దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారానే గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆహ్వానించి వచ్చిన దరఖాస్తులను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతీ ఒక్కరికీ పథకానికి సంబంధించిన లబ్ధి చేకూర్చడానికి కృషి చేశాం. ఈ నెల 29న జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రులు, జిల్లాలోని అందరు ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ సమక్షంలో వాహన మిత్ర 5వ విడత నగదు జమ జరుగుతుంది.

– ఎస్.శాంతకుమారి,
ఉప రవాణా కమిషనర్, ఏలూరు

పది మంది ఓటర్లు దాటితే పరిశీలించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): పది మంది ఓటర్లు దాటిన ప్రతి ఇంటిని క్షేత్రస్థాయిలో పునఃపరిశీలన చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం భీమవరం పురపాలక సంఘ పరిధిలో నరసయ్య అగ్రహారం, బ్యాంకు కాలనీలో 10 మంది ఓటర్లకు మించి ఉన్న గృహాలను కలెక్టరు క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. వారందరూ ఆ ఇంట్లోనే నివాసం ఉంటున్నారా, వేరే ప్రాంతంలో ఉంటున్నారా? అని కలెక్టరు ఆరా తీశారు. ఇందుకు సంబంధించిన వివరాలను, ఇంటి డోర్ నెంబర్లను కంప్యూటర్‌లో నమోదు చేశారా అని బీఎల్వోలను కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రెండు కిలోమీటర్ల పరిధిలో పోలింగు స్టేషన్‌ను కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. చేర్పులు, మార్పులు, డెత్‌లు కొత్త పోలింగు స్టేషన్ల ఏర్పాటుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించడంతో పాటు, స్థానిక ప్రజల విజ్ఞాపనలను కూడా పరిగణలోనికి తీసుకోవాలన్నారు. ఒక వీధిలోని వారు, ఒక కుటుంబం, ఒక అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఓటర్లు ఒకే పోలింగ్ స్టేషన్లో ఓటు హక్కు వినియోగించుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విరివిగా రుణాలు మంజూరు చేయాలి

బ్యాంకర్లతో జేసీ సమీక్ష



2023-24 వార్షిక రుణ ప్రణాళిక బుక్ లెట్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశంచౌక్): జిల్లాలో వివిధ రంగాలకు విరివిగా రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి బ్యాంకర్లను కోరారు. మంగళవారం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో బ్యాంకర్ల సమావేశం జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి వార్షిక రుణ ప్రణాళికను రూ.20,220 కోట్ల లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇందుకు బ్యాంకర్లు రుణాలు మంజూరులో తమ వంతు సహకారాన్ని అందించి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రాధాన్యత రంగాలకు రూ.17,705 కోట్ల రుణాలు లక్ష్యంగా నిర్ణయించగా వాటిలో తక్కువ కాలవ్యవధి వ్యవసాయ రుణాలకు రూ.7,080 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.4,094 కోట్లు, వ్యవసాయ సాంకేతిక పరికరాలు తదితరాలకు రూ.1,372 కోట్లు, ఎగుమతులతో కలిపి ఎంఎస్ఎంఈకి రూ.4,314 కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగాలకు రూ.2,615 కోట్లుగా నిర్ణయించామన్నారు. ప్రాధాన్యేతర రంగాలకు రూ.2,515 కోట్లు లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

నూరు శాతం లక్ష్యం సాధించాలి

టిడ్కో రుణాలు ఇంతవరకూ 10,266 మంది లబ్ధిదారులకు మంజూరు చేశామని, మిగిలిన 940 మందికి రుణాలు మంజూరు చేసి నూరు శాతం లక్ష్యం సాధించాలన్నారు. సీసీఆర్సీ కార్డులు విరివిగా జారీ చేసి కౌలు రైతులకు రుణాల మంజూరుకు బ్యాంకర్ల సహకరించాలన్నారు. పీఎంఈజీపీ పథకం కింద 65 టార్గెట్ కాగా నూరు శాతం లక్ష్యసాధన జరిగిందని చెప్పారు. పీఎం విశ్వకర్మ యోజన పథకంకు రాష్ట్రంలోని పశ్చిమగోదావరి, తిరుపతి, నెల్లూరు నెల్లూరు జిల్లాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారన్నారు. ఈ పథకంపై విస్తృత ప్రచారం కల్పించి సంప్రదాయ వృత్తుల వారికి రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న తోడు ఏడో విడత లక్ష్యం 12,343 దరఖాస్తులు కాగా, 12,438 మంది దరఖాస్తుదారులకు రుణాలు మంజూరు చేశామన్నారు. అనంతరం 2023–24 వార్షిక రుణ ప్రణాళిక బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, యుబీఐ రీజనల్ హెడ్ పి.సంగీత కుమారి, ఆర్‌బీఐ ఎల్డీఓ పూర్ణిమ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరు 1న శ్రమదాన్-స్వచ్ఛత కార్యక్రమం

ఏలూరు(మెట్రో): మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబరు 1న ఆదివారం పరిశుభ్రత కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ కోరారు. అక్టోబరు 1న ఆదివారం ఉదయం 10 గంటలకు సమష్టిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. జిల్లా అధికారులు, మండల, గ్రామ పంచాయితీ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తమ క్షేత్ర సిబ్బందికి అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. స్వచ్ఛత కోసం ప్రతి ఒక్కరూ గంట పాటు శ్రమదాన్ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు.

మరో మైలురాయి కేంద్రీయ విద్యాలయం

- నూజివీడు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయం
- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, పలువురు ప్రజా ప్రతినిధులు

నూజివీడు: నూజివీడు ప్రాంతానికి కేంద్రీయ విద్యాలయం మంజూరు కావడం కీలక పరిణామమని, నూజివీడు అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నూజివీడుకు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయడంపై మంగళవారం ఎమ్మెల్యే ప్రతాప్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నూజివీడులో ట్రిపుల్ ఐటీని ఏర్పాటు చేస్తే, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రాష్ట్రానికి 8 కేంద్రీయ విద్యాలయాలు మంజూరు కాగా అందులో ఒకటి నూజివీడుకు మంజూరైందన్నారు. కేంద్రీయ విద్యాలయం నూజివీడులో ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతూ ప్రతిపాదనలు పంపుతున్నామని సీఎం దృష్టికి తీసుకెళ్లగా ముందుకెళ్లమని చెప్పడమే కాకుండా వెంటనే కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన కోట్లాది రూపాయల విలువైన ఏడెకరాల స్థలాన్ని కేబినెట్ మీటింగ్ పెట్టి కేటాయించారన్నారు. మంజూరు కోసం తనతో పాటు ఎంపీ కోటగిరి శ్రీధర్ కలిసి మూడు సార్లు ఢిల్లీ వెళ్లి కేంద్రీయ విద్యాలయ కమిషనర్‌ను కలిసి ఏర్పాటు ఆవశ్యకతపై చర్చించామన్నారు. ప్రతిపాదనలు పంపే సమయంలో అప్పటి కృష్ణా జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న నివాస్ సహకారం ఎంతో ఉందన్నారు. ఒక సంస్థను ఏర్పాటు చేయాలంటే రెండు నిమిషాల్లో అయ్యే పనికాదని, రెండేళ్లుగా దీని ఏర్పాటు కోసం కృషి చేశామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంస్థలు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని, 15 ఎకరాల ప్రభుత్వ భూమి కోసం చూస్తున్నామని, ఎక్కడైనా లభ్యం కాగానే మరో పెద్ద విద్యాసంస్థ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కేంద్రీయ విద్యాలయ హెడ్‌ఆఫీసు తీసుకునే నిర్ణయం మేరకు అడ్మిషన్లు నిర్వహిస్తారని, దీనిని తాత్కాలికంగా ఎంప్లాయిస్ కాలనీలో నిర్మించిన తరగతి గదుల్లో నిర్వహిస్తారన్నారు. కేంద్రీయ విద్యాలయం మంజూరు చేసినందుకు సీఎం జగన్, పీఎం మోడీకి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ వాళ్లది దోచుకొనే మనస్తత్వం

టీడీపీ నాయకులు అభివృద్ధి గురించే ఆలోచించరని, దోచుకొని దాచుకునే మనస్తత్వమని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు విమర్శించారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన టీడీపీ నాయకులవంటి వారిని తన రాజకీయ జీవితంలో ఎంతోమందిని చూశానని, రాజకీయాల్లో ఓర్పు ఉండాలన్నారు. టీడీపీ హయాంలో చెరువుల్లో మట్టిని, వాగుల్లో, నదుల్లో ఇసుకను దోచుకోవడమే కాకుండా తహసీల్దార్ వనజాక్షిపై దాడి చేసిన చరిత్ర టీడీపీదని దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు ఖాయమని అన్నారు. క్రికెట్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేస్తున్నామని, త్వరలోనే బైపాస్ రోడ్డు పనులను ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష అద్భుత అవకాశం



మహదేవపట్నంలో ఆరోగ్య సురక్ష పైలట్ క్యాంపును పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఉండి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణకు అద్భుత అవకాశమని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ బీ భానునాయక్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పైలెట్ హెల్త్ క్యాంపు కార్యక్రమంలో భాగంగా ఉండి మండలం మహదేవపట్నం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం జగనన్న ఆరోగ్య సురక్ష అన్నారు. దీని ద్వారా గ్రామంలోని ప్రజల ఆరోగ్య పరిరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరిస్తుందన్నారు. దీనిలో భాగంగానే ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రతీ ఒక్కరి ఆరోగ్య వివరాలు సేకరిస్తూ ఇంటింటికీ సర్వే నిర్వహిస్తామన్నారు. సాధారణ పరీక్షలు స్థానికంగానే నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. కొందరిలో గుర్తించిన ఆరోగ్య సమస్యలు పెద్దవి అయితే సంబంధిత ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తామన్నారు.

ఆశాజనకంగా సార్వా

- జిల్లాలో 2.13 లక్షల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది 53 శాతం లోటు వర్షపాతం
- అయినప్పటికీ ఏపుగా పెరిగిన వరి పైరు



తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలో కోతకు సిద్ధమవుతున్న సార్వా వరి


సాక్షి, భీమవరం: సార్వా సీజన్ ప్రారంభం నుంచి జిల్లాలో లోటు వర్షపాతం ఉన్నప్పటికి కాలువల ద్వారా సాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకపోవడంతో వరి ఆశాజనకంగా ఉంది. ఇప్పటికే తాడేపల్లిగూడెం ప్రాంతంలో సార్వా మాసూళ్లు ప్రారంభం కాగా ఎకరాకు 40 బస్తాలకు పైగా దిగుబడి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే వర్షపాతంలో 53 శాతం లోటు కన్పిస్తున్నా వరి పైరు మాత్రం ఏపుగా పెరిగి గత ఏడాది కంటే ఎకరాకు సుమారు 5 బస్తాల వరకు ఎక్కువ దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. 20 మండలాల్లో ఈ ఏడాది సుమారు 2.13 లక్షల ఎకరాల్లో సార్వాలో ఎక్కువ మంది రైతులు ఎంటీయూ 1061, ఎంటీయూ 1318, స్వర్ణ వంటి రకాలను వేశారు. నాట్ల సమయంలో వర్షాలు తక్కువగా ఉండడంతో సాగునీటి కోసం రైతులు కొంత ఇబ్బంది పడ్డారు. ఆ తరువాత నీటిపారుదల శాఖ ప్రత్యేక చర్యలతో నీటి సరఫరాను పెంచడంతోపాటు అప్పుడప్పుడు భారీ వర్షాలు కురవడంతో సాగునీటి కొరతను అధిగమించారు.

సార్వాలో 53 శాతం లోటు వర్షపాతం

జిల్లాలో గత ఏడాది విస్తారంగా వర్షాలు కురవడంతో పాటు గోదావరికి వరదలు రావడంతో అనేక మంది తీవ్రంగా నష్టపోయారు. గోదావరి తీరప్రాంత పొలాలతో పాటు పల్లపు ప్రాంతాల్లోని వరి పైరు దెబ్బతింది. గత ఏడాది జిల్లా మొత్తం మీద సుమారు 1,222 సెంటీ మీటర్ల వర్షం కురవాల్సివుండగా దాదాపుగా 1,417 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుత సీజన్‌లో ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 723 సెంటీమీటర్ల వర్షం కురవాల్సివుండగా కేవలం 348 సెంటీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. అయినప్పటికీ వరిపైరుపై పెద్దగా చీడపీడలు ఆశించకుండా ఎక్కువ పిలకలు తొడిగి పంట ఆశాజనకంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

వర్షాలు ఎక్కువైతే ఇబ్బంది : సార్వా వరిపైరుగా ఎక్కువగా వర్షాలు కురవడం వల్ల ఎండలు తక్కువై కిరణజన్యసంయోగక్రియ మందగమనంలో ఉండడం వల్ల దిగుబడి తగ్గుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 15 రోజులకు ఒకసారి వర్షం కురవడం వల్ల భూమిలో ఆరుదల ఏర్పడడమేగాక వర్షం నీటి ద్వారా నైట్రోజన్ లభించి ప్రత్యేకంగా నైట్రోజన్ వేయాల్సిన అవసరం ఉండదు. వర్షాలు ఎక్కువగా లేకపోవడం వల్ల సుడిదోమ, కాండం దొలుచుపురుగు, ఆకుముడత, పాడతెగులు, ఎండాకు తెగులు, దుంపకుళ్లు వంటి తెగుళ్లు పెద్దగా ఆశించవని తద్వారా పురుగుల మందు ఖర్చు తగ్గడమేగా పంట దిగుబడి పెరుగుతుందని చెబుతున్నారు. గత ఏడాది హెక్టారుకు సరాసరి 5,156 కిలోల ధాన్యం దిగుబడి వస్తే ఈ ఏడాది 5,500 కిలోల నుంచి 6 వేల కిలోల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.

పెరగనున్న దిగుబడి



ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ పంట మాత్రం ఆశాజనంగా ఉంది. లోటు వర్షపాతంతో పైరు ఏపుగా దుబ్బు బాగా చేసింది. ఎక్కువ పిలకలు తొడగడం వల్ల దిగుబడి పెరిగే అవకాశముంది. వరిపైరుపై సూర్యరశ్మి ఎక్కువగా ఉండడం వల్ల పైరుపై చీడపీడల ఉధృతి అంతగా లేకపోవడంతో పెట్టుబడి ఖర్చు తగ్గడమేగాక దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

– జెడ్.వెంకటేశ్వరరావు,
జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

వర్షం లేకున్నా ఇబ్బందులు లేవు



సార్వా సాగులో వర్షం తక్కువగా ఉన్నప్పటికీ సాగునీటి ఇబ్బందులు లేవు. నాట్లు వేసే సమయంలో సాగునీటి కొరత ఏర్పడింది. వర్షాలు తక్కువగా ఉండడంతో ముంపుబారిన పడకుండా పైరు ఏపుగా పెరిగి ఆశాజనకంగా ఉంది. గత సార్వా సీజన్ కంటే మంచి దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం

– కె అప్పారావు, రైతు, మొగల్లు, పాలకోడేరు మండలం

సాక్షి ఫొటోగ్రాఫర్ రియాజ్‌కు ప్రతిభా పురస్కారం



గుంటుపల్లి బౌద్ధ గుహలు, (ఇన్‌సెట్‌లో) ఎస్‌కే రియాజ్, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్ ఎస్‌కే రియాజ్ ఫొటోగ్రఫీలో అరుదైన ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫీ కౌన్సిల్ సహకారంతో విజయవాడలో ఇటీవల నిర్వహించిన ఫొటో ఎగ్జిబిషన్‌లో రియాజ్ తీసిన చిత్రానికి బంగారు పతకంతో పాటు, ప్రతిభా పురస్కారం లభించింది. జిల్లాలోని గుంటుపల్లిలో పచ్చని ప్రకృతి మధ్య, కొండకోనల్లో భారత దేశ చరిత్ర సంస్కృతికి నిలువుటద్దాల్లా నిర్మితమైన పురాతన బౌద్ధ గుహలను రమణీయంగా తీసిన చిత్రానికి ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 27న విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో రియాజ్‌కు పురస్కారం అందించనున్నారు.

క్లుప్తంగా


చిలకమర్తికి ఘన నివాళి


వీరవాసరంలో చిలకమర్తి జయంతి నిర్వహిస్తున్న దృశ్యం


వీరవాసరం: చిలకమర్తి లక్ష్మీ నరసింహం జయంతిని వీరవాసరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత చిలకమర్తి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రముఖ పండితులు చిలకమర్తి సుబ్రహ్మణ్యశాస్త్రి మాట్లాడుతూ చిలకమర్తి ఔన్నత్యాన్ని, సమాజసేవానిరతిని, హరిజనోద్ధరణకు చేసిన కృషిని కొనియాడారు. కేజీఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ దాయన చంద్రజీ మాట్లాడుతూ చిలకమర్తి సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకుని సంఘ సంస్కరణకు పూనుకున్నారన్నారు. సుమారుగా 100 కావ్యాలు, నాటకాలు రచించి సాహిత్యసేవ చేశారన్నారు. అంతేకాక ఆంగ్లేయుల పాలనను ఎండగట్టి ప్రజలలో స్వాతంత్ర్యకాంక్షను రగిల్చి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని దేశసేవ కూడా చేశారన్నారు. సభాధ్యక్షుడు గుండా రామకృష్ణ మాట్లాడుతూ చిలకమర్తి వీరవాసరం వాస్తవ్యులు కావడం గర్వకారణమన్నారు. అనంతరం దాయన చంద్రజీ, ఎంఆర్‌కే హైస్కూల్ హెచ్ఎం జుత్తిగ శ్రీనివాసు, సంస్కృత ఉపాధ్యాయులు చిలుకూరి ఫణికుమార్‌న, తెలుగు ఉపాధ్యాయులు పంపన సాయిబాబు, కుసుమే ఆనందరావులను వీరవాసరం కళాపరిషత్ తరపున చిలకమర్తి పురస్కారంతో సత్కరించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, యర్రంశెట్టి సీనయ్య, యర్రంశెట్టి వెంకటరత్నం, డాక్టర్ లక్ష్మీ కల్యాణి పాల్గొన్నారు.

జాతీయ రెజ్లింగ్ పోటీలకు గురుకుల విద్యార్థి

పెదవేగి: కృష్ణా జిల్లా నున్నలో ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ అండర్–17 పోటీల్లో తమ విద్యార్థి కె.ఫణీంద్ర రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించినట్లు పెదవేగిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల హెచ్ఎం వైఎస్సార్ శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థి ఫణీంద్రను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ చూపడం ద్వారా జాతీయ పోటీలకు ఫణీంద్ర ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ కె.జయరాజు, పీఈటీ పి.గురుమూర్తి, ఉపాధ్యాయులు ఫణీంద్రను అభినందించారు.


పాపికొండల నడుమ ప్రవహిస్తున్న గోదావరి


ద్వారకాతిరుమలలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం


పట్టిసంలోని వీరభద్ర స్వామి ఆలయం

‘పశ్చిమ’ పర్యాటకం.. ఆహ్లాదకరం

- ఉమ్మడి పశ్చిమగోదావరిలో అలరిస్తున్న పర్యాటక ప్రాంతాలు
- పాపికొండలు, పేరుపాలెం బీచ్, కొల్లేరు సందర్శనతో ఉల్లాసం
- ప్రసిద్ధి చెందిన చిన్న తిరుపతి, పట్టిసం, పంచారామాలు, మావుళ్లమ్మ ఆలయాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

రోజువారీ పనులతో చిన్నా పెద్దా నిత్యం ఒత్తిడితో గడుపుతుంటారు. ఈ ఒత్తిడి నుంచి మనసు కాస్త ఉల్లాసంగా ఉండాలంటే పర్యాటక ప్రాంతాల సందర్శన ఓ ప్రత్యామ్నాయం. ఇది ఔషధం లాంటిది కూడా. కుటుంబ సమేతంగా, బంధువులు, స్నేహితులతో కలిసి పర్యాటక ప్రదేశాలకు వెళ్లి గడిపితే నూతన ఉత్సాహం కలుగకమానదు. అలా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అనేక పర్యాటక ప్రాంతాలు ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ముఖ్యమైన పలు పర్యాటక ప్రాంతాల వివరాలు మీ కోసం..


భీమవరం గునుపూడిలోని పంచారామక్షేత్రం


పేరుపాలెం బీచ్

భీమవరం (ప్రకాశం చౌక్): పూర్వ ఉమ్మడి జిల్లాలోకి అడుగు పెట్టిన యాత్రికులకు పచ్చని తివాచీ పరిచినట్లు ఉండే వరి పొలాలు స్వాగతం పలుకుతాయి. కొబ్బరి, పండ్లు, కూరగాయ తోటలు, పంట కాలువలుపై లాకులు పర్యాటకులను చూపుతిప్పుకోనివ్వవు. ముఖ్యంగా పర్యాటకంగా ప్రసిద్ధి చెందిన ప్రాంతాల్లో పాపికొండలు, పట్టిసీమ, పోలవరం ప్రాజెక్టు, గుంటుపల్లి గుహలు, పేరుపాలెం బీచ్‌లతో పాటు మావుళ్లమ్మ, పంచారామక్షేత్రాలు, చిన్న తిరుపతి, మద్ది తదితర పుణ్యక్షేత్రాలు ముఖ్యమైనవి. జిల్లాకు వచ్చే పర్యాటకులు సిద్ధాంతం, చించినాడ వంతెనల మీదుగా గోదావరి నదిని దాటుతూ ప్రయాణించడం ప్రత్యేక అనుభూతినిస్తుంది.

పాపికొండలు

తూర్పు కనుమలలో దట్టమైన అడవులతో నిండి పూర్వ పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల నడుమ ఈ పాపికొండలు ఉన్నాయి. పాపికొండల వద్ద గోదావరి చాలా తక్కువ వెడల్పులో రెండు కొండల మధ్య ప్రవహిస్తూ మరింత ఆహ్లాదకరంగా ఉంటుంది. పాపికొండల మధ్య నుంచి గోదావరిలో లాంచీ ప్రయాణం పర్యాటకులకు మరిచిపోలేని అనుభవం. ఈ విహార యాత్ర పట్టిసం నుంచి మొదలై పోలవరం, పోచమ్మ గుండి, సిరివాక, కొల్లూరు, పేరంటాలపల్లి మీదుగా భద్రాచలం వరకు సాగుతుంది. రాజమహేంద్రవరం నుంచి 60 కిలోమీటర్లు, తెలంగాణలోని భద్రాచలం నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఈ పాపికొండల ప్రాంతం ఉంది.

పేరుపాలెం బీచ్

పేరుపాలెం బీచ్ నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉంటుంది. కార్తీక మాసంలో స్నానాల కోసం వేలాది మంది బీచ్‌కు తరలివస్తారు. మోళ్లపర్రు బీచ్ కూడా పర్యాటకులతో సందడిగా ఉంటుంది. ఇక్కడి రిసార్ట్స్, ఆలయాలు అకట్టుకుంటాయి.

గోదావరి తీరంలో రిసార్ట్స్: సిద్ధాంతం వద్ద గోదావరి ఏటి గట్టుపై పర్యాటక శాఖ నిర్వహిస్తున్న సన్‌రైజ్ రిసార్ట్ పర్యాటకులు సేద తీరడానికి ఎంతో అనుకూలం. అలాగే పెద్దమల్లంలో నిర్మించిన అతిథిగృహంలో గోదావరి అందాలు చూస్తూ ఆతిథ్యం స్వీకరించవచ్చు.

కొల్లేరు

రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన సహజసిద్ధమైన మంచినీటి సరస్సు. గోదావరి, కృష్ణా నదుల డెల్టా ప్రాంతంలో లక్ష ఎకరాల్లో వ్యాపించి ఉన్న ఈ సరస్సు ప్రకృతి అందాలకు, అరుదైన విదేశీ వలస పక్షులకు నిలయం. ఆకివీడు నుంచి లాంచీల ద్వారా, లేదా ఆలపాడు నుంచి చిన్న రవాణా సాధనాలతో కర్రల వంతెన ద్వారా, ఏలూరు నుంచి కై కలూరు మీదుగా రోడ్డుమార్గంలో ఇక్కడికి చేరుకోవచ్చు. ఆటపాకలో ఏర్పాటు చేసిన పక్షుల సంరక్షణ కేంద్రాన్ని ఇటీవల పర్యాటకులు ఎక్కువగా సందర్శిస్తున్నారు.

పోలవరం ప్రాజెక్టు

పోలవరం సమీపంలో నిర్మాణంలో ఉన్న బహుళార్థ సాధక నీటిపారుదల పథకం. విశాఖపట్నం, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని మెట్టప్రాంతాలకు సాగునీటిని అందించేందుకు మహానేత వైఎస్సార్ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే విశాఖపట్నం, గోదావరి, కృష్ణా జిల్లాల సాగునీటి అవసరాలే కాక విశాఖపట్టణం, చుట్టుపక్కల ప్రాంతాలకు తాగునీటి, పారిశ్రామిక అవసరాలు తీరనున్నాయి. అంతేకాక విద్యుదుత్పత్తి, జలరవాణాలోని ఇబ్బందులను అధిగమించడానికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. ఏలూరు జిల్లాలోని రామాలపేట గ్రామం వద్ద, (రాజమండ్రి – కొవ్వూరు రోడ్డు నుంచి 34 కి.మీ ల దూరం, ధవళేశ్వరంలోని కాటన్ ఆనకట్టకి 42 కి.మీ ఎగువన) ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఉంది.

దర్శనీయ పుణ్యక్షేత్రాలు ఇవే..

జిల్లాలో ప్రసిద్ధి చెందిన దర్శనీయ పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. భీమవరంలోని శ్రీఉమాసోమేశ్వర జనార్దనస్వామి, మావుళ్లమ్మ, పాలకొల్లులోని క్షీరామలింగేశ్వరస్వామి. కాళ్లకూరులో శ్రీవెంకటేశ్వరస్వామి, ఆచంటలో శ్రీరామేశ్వరస్వామి, నత్తా రామేశ్వరంలోని శివాలయం, వీరపాలెంలోని శివక్షేత్రం, యనమదుర్రులోని శక్తీశ్వరస్వామి, దువ్వలో దానేశ్వరమ్మ, తిమ్మరాజుపాలెంలోని కోట సత్తెమ్మ, ఆచంట, పెద్ద అమిరంలోని జైన్ దేవాలయాలు సందర్శకులతో సందడిగా ఉంటాయి. అలాగే ఏలూరు జిల్లాలో పట్టిసంలోని వీరభద్ర స్వామి, జంగారెడ్డిగూడెంలోని గోకులతిరుమల పారిజాతా గిరి వెంకటేశ్వరస్వామి, చిన తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ద్వారకాతిరుమలలోని శ్రీవెంకటేశ్వరస్వామి, గురువాయి గూడెంలోని మద్ది ఆంజనేయస్వామి తదితర పుణ్యక్షేత్రాలు నిత్యం భక్తులతో రద్దీగా ఉంటాయి. అంతేకాక రాష్ట్రంలోనే అతిపెద్ద చర్చిగా భీమవరంలోని రూపాంతర దేవాలయం ఉంది. పెనుగొండంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మస్థలంగా ఉన్న వాసవీ ధామ్‌ను పర్యాటకులు సందర్శిస్తారు. రెండు తెలుగు రాష్ట్రల నుంచి ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యతో తరలివచ్చి 108 అడుగుల ఎత్తు ఉండే అమ్మవారి విగ్రహాన్ని దర్శించుకుంటారు.

జూదరుల అరెస్టు


లింగపాలెం: ములగలంపాడులో పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు చింతలపూడి సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు మంగళవారం చెప్పారు. వీరి నుంచి రూ.7,200 నగదు, 6 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సైలు ప్రసాద్, చెన్నారావు పాల్గొన్నారు.


గ్రామీణ యువతకు స్వయం ఉపాధిపై శిక్షణ


శాస్త్రవేత్తలకు సూచనలు ఇస్తున్న వీసీ ఆర్.శారదాజయలక్ష్మిదేవి, పరిశోధనా సంచాలకులు ఎల్.ప్రశాంతి

పెనుమంట్ర: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా గ్రామీణ యువతకు స్వయం ఉపాధి పథకాలపై శిక్షణ ఇస్తున్నామని వర్సిటీ వీసీ డాక్టర్ ఆర్.శారదాజయలక్ష్మిదేవి చెప్పారు. మంగళవారం మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం సందర్శనకు వచ్చిన ఆర్.శారదాదేవి, పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి గతేడాది 135–140 రోజుల వ్యవధి కలిగిన రెండు కొత్త వరి వంగడాలు ఎంటీయూ 1310, ఎంటీయూ 1321 రకాలను రూపొందించామన్నారు. వీటిని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలలో సాగు చేస్తున్నారన్నారు. ఈ రకాలపై తమ జోన్‌లో ఉన్న అన్ని విస్తరణ కేంద్రాలలో క్షేత్ర పరిశీలన చేస్తున్నామన్నారు. కూలీల కొరత, సాగు ఖర్చులు తగ్గించడానికి విశ్వవిద్యాలయ పరిధిలో డ్రోన్ పైలెట్‌పై శిక్షణ ఇస్తోందని, దీనిని గ్రామీణ యువత వినియోగించుకోవాలని కోరారు. ప్రత్తి తీత కొరకు ట్రాక్టర్ ద్వారా నడిచే కోత యంత్రం, చెరకు కోతల కొరకు అనువైన యంత్రాలను కూడా రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రతి పరిశోధన, విస్తరణ కేంద్రాలలో శాస్త్రవేత్తల కొరత ఉందని, త్వరలో శాస్త్రవేత్తలను పూర్తి స్థాయిలో నియమిస్తామన్నారు. పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి మాట్లాడుతూ గత మూడేళ్లలో రూ.133 కోట్ల విలువైన మౌలిక వసతుల పనులను పరిశోధనా స్థానంలో చేపట్టామన్నారు. మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో చేస్తున్న సమీకృత వ్యవసాయ విధానం, గ్రీన్ హౌస్, వాయువుల ఉద్గారం, తెగుళ్లు, పురుగులు, ఎలుకల నిర్మూలనకు సంబంధించిన వివిధ ప్రయోగాలను వారు సందర్శించి శాస్త్రవేత్తలకు తగిన సూచనలు చేశారు. పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.భరత్‌లక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్తలు ఎం.దక్షిణామూర్తి, ఎంవీ కృష్ణాజీ, సీహెచ్ శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిడుగు పడి ఇద్దరు మహిళా కూలీల మృతి


సొంగా దేవమాత


సొంగా మనీషా

లింగపాలెం: పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్లగా పిడుగు పడి ఇద్దరు మహిళలు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. పాశ్యానగరం గ్రామానికి చెందిన సొంగా దేవమాత (45), సొంగా మనీషా (21), సొంగా జ్యోత్స్న కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటారు. మంగళవారం ఉదయం పత్తి తోటలో పనికి వెళ్లారు. పొలంలో పని చేస్తుండగా పిడుగులతో కూడిన వర్షం పడటంతో సమీపంలో ఉన్న చెట్టు కింద తలదాచుకునేందుకు వెళ్లారు. అదే సమయంలో వారికి సమీపంలో పిడుగు పడటంతో ముగ్గురు అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయారు. స్థానికులు గుర్తించి వారిని చికిత్స నిమిత్తం చింతలపూడి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంలోనే దేవమాత, మనీషా మృతి చెందారు. సొంగా జ్యోత్స్నకు చికిత్స అందిస్తున్నారు. ఇద్దరు మహిళల మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా కూలీల కుటుంబాలకు న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే ఎలీజా

పాశ్యానగరంలో మంగళవారం పిడుగు పడి మృతి చెందిన ఇద్దరు మహిళా కూలీల కుటుంబాలకు న్యాయం చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా విజయవాడ నుంచి ఫోన్‌లో జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కోరారు. మృతి చెందిన పేద కుటుంబాలను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. గాయపడి చికిత్స పొందుతున్న సొంగా జోత్స్నకు మరింత మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఎలీజా ఫోన్‌లో ఏలూరు డీఎంహెచ్ఓను ఆదేశించారు. మృతుల కుంటుబాలకు ఎమ్మెల్యే ఎలీజా ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

స్కూల్ గేమ్స్ అండర్–19 బాలికల జిల్లా జట్లు ఇవే


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న విద్యార్థినిలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్కూల్ గేమ్స్ అండర్–19 జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఏలూరులోని సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కే. జయరాజు ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలల విద్యార్థినులకు బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ జిల్లా జట్ల ఎంపికలు జరిగాయి. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైన జిల్లా జట్ల వివరాలు ఇలా ఉన్నాయి.

బాస్కెట్‌బాల్: డి.పావని ప్రియ, వి.యామిని, ఎ.పూర్ణచంద్రిక, పి.జయశ్రీ, వి.నిఖిల, టి.రాణి, ఎల్.పావని, ఎ.జయశ్రీ, ఐ.సిరి, ఎస్.మోహన గాయత్రి, పి.అనూష, ఈ అక్షిత, పి.మహిశ్రీ, జి.పావని, యూ అనుష్క, బీ జమిలియా.

బాల్ బ్యాడ్మింటన్: జీ శిరీష, ఎస్.నవ్యశ్రీ లక్ష్మి, ఎం.జాహ్నవి ప్రియ, ఎస్.కావ్య, సీహెచ్ ఇందుమతి, పీ దీపిక, డీ తేజశ్విని, జీ లాస్యప్రియ, కే దుర్గా గాయత్రి, ఎం.చరణ్య, స్టాండ్‌బై క్రీడాకారిణిలుగా డీ లక్ష్మి, ఎం.అమృత పావని, ఎస్‌కే షహీదా.

కబడ్డీ: పీ కావ్యశ్రీ, కే కళ్యాణి, బీ దీపిక, బీ కిరణ్మయి, పీ తేజశ్వి, బీ నీలిమ, జే సంజన, కే శ్రావణి, ఎస్ శృతి, ఆర్ షీబారాణి, పీ లావణ్య, టీ గీతాంజలి, కే మహాలక్ష్మి, డీ.మారిక, బీ ధరణి, జీ శరణ్య.

హ్యాండ్‌బాల్: ఆర్.సౌమ్యశ్రీ, ఉమామహేశ్వరి, ఎస్.జస్సీ తన్మయి, ఏవీ శ్రావణకుమారి, జీ.ప్రవల్లిక సత్య, పీ.మౌనిక, సీహెచ్ నాగదుర్గ, కే దీక్షిత, సీ రక్షిత, ఎస్.మేరీగ్రేస్, సీహెచ్ మహాలక్ష్మి, పీ సౌజన్య, కే పరిమళ, పీ నందిని, పీ భవాని, బీ మధులత, స్టాండ్‌బైగా వై.కీర్తన, బీ నీలిమ, టీ మానసదుర్గ, ఎం.జ్యోత్స్న



క్లుప్తంగా

గణనాథుడికి ప్రత్యేక పూజలు



తణుకులో గణనాథుడిని దర్శించుకుంటున్న కారుమూరి సునీల్‌కుమార్ తదితరులు

తణుకు అర్బన్: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తణుకులో ప్రత్యేక మండపాల్లో వేంచేసియున్న గణనాథుడిని యువనేత కారుమూరి సునీల్‌కుమార్ దర్శించుకున్నారు. స్థానిక పెరవలి రోడ్డు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రాంతంలో నిర్వహిస్తున్న గణనాథుడి పూజాధికాల్లో సునీల్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కుడుపూడి చంద్రరావు పాల్గొన్నారు.

పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి శోభారాణి అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో వసతి గృహ సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ హాస్టల్స్‌లో సలహా సంఘ సమావేశాలు, పేరేంట్స్‌కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. పిల్లల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు, నర్సాపురం, సహాయ సాంఘీక సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయుడు చిలకమర్తి

అత్తిలి: కళా తెలుగు సాహితి రంగంలో చిలకమర్తి లక్ష్మీనరసింహం స్థానం ఎప్పటికీ చిరస్థాయిగా ఉంటుందని, ఆయన సేవలు మరువలేనివని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్‌సీఎం దత్ చెప్పారు. అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతిని మంగళవారం ఘనంగా జరిపారు. ఈసందర్భంగా హెచ్‌ఎం దత్ మాట్లాడుతూ చిలకమర్తివారు నిమ్నజాతుల వారికి విద్యకోసం, ప్రత్యేకంగా పాఠశాల ఏర్పాటు చేశారన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, డీఎంజీ ప్రసాద్, లలిత, సుభద్ర, నాగేశ్వరరావు, హర్షద్, మాధవ పాల్గొన్నారు.

జగనన్న భూ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: రైతులు, ప్రజల కోసం సమగ్రంగా జరుగుతున్న జగనన్న శాశ్వత భూహక్కు, భూసర్వే ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయసలహామండలి జిల్లా, మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్‌లు పేర్కొన్నారు. మండల తహసిల్దార్ జీవీ శేషగిరిరావు ఆధ్వర్యంలో సర్వేయర్లు, వీఆర్వోలు, సిబ్బందితో కలిసి జట్లపాలెం సచివాలయం వద్ద మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. గుండుమోగుల సాంబయ్య, మునీంద్ర, కట్టుబోయిన నాగేశ్వరరావు, మండల వ్యవసాయాధికారి కె. పార్థసారథి, గ్రామ సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, ఉపసర్పంచ్ చెరుకు హనుమంతు, వీఆర్వోలు ప్రభువరం, సురేష్, వీఏఏలు శ్యాంబాబు, శ్వేత, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో లయన్స్ డైమాండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక 35వ వార్డు మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో జోన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో దాత సకూరు ఎల్లోజీరావు సౌజన్యంతో పిల్లలకు భోజన ప్లేట్స్, స్నాక్స్, పెన్సిల్స్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య, సెక్రటరీ మద్దుకూరి మోహర్ ప్రసాద్, మృతంజయకుమార్, దేవా, శివ, సత్యదేవ్, సాయి సత్యనారాయణరాజు, పల్లెల శేషగిరి, డాక్టర్ కమల, సుశీల పాల్గొన్నారు.

ధీర వనిత చాకలి ఐలమ్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ధీర వనిత చాకలి ఐలమ్మ అని పలువురు బీసీ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ 128వ జయంతిని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఐలమ్మ తెలుగు రాష్ట్రాలలో పోరాట పటిమను యావత్ ప్రపంచానికి చాటి చెప్పిన యోధురాలు అన్నారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అత్తిలి బాబి, కేశవభట్ల విజయ్, తుమరాడు చిన్న, మారిశెట్టి నరసింహమూర్తి, చల్లా సుధీర్, లక్ష్మణ్, రామకృష్ణ, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు నేడు వేలం

తణుకు: తణుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు సీఐ ఆర్.సత్యవతి తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు సజ్జాపురంలోని స్టేషన్ ఆవరణలో జరిగే ఈ వేలంపాటలో పాల్గొనే వారు రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు స్టేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా

తాడేపల్లిగూడెం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఆరోగ్య భరోసా కలుగుతుందని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఏవీ. వెంకటేష్ అన్నారు. మంగళవారం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి జగన్నాథపురం, మాధవరం, నవాబుపాలెం, అప్పారావుపేట, దండగర్ర, ఆరుగొలను, వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ పరిధి పెదతాడేపల్లి తదితర గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో నవ్యలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ద్వారా గుర్తించిన రోగులను టోకెన్‌లు ఇచ్చి ఈ నెల 30వ తేదిన జరగనున్న ప్రత్యేక క్యాంపులకు పంపించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. దండగర్రలో 15మంది, ఆరుగొలను 67మంది, జగన్నాథపురం -1లో 24, అప్పారావుపేటలో 39మందికి దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, సుగర్, రక్తహీనత, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, డయాలసిస్, పెరాలసిస్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో జీ.వెంకటేశ్వరరావు, సీహెచ్‌వోలు నవ్యలక్ష్మి, జి.కృపా జాకబ్, కే.సత్యవేణి, వి.రూత్, హెల్త్ విజిటర్ మణి, ఏఎన్‌ఎంలు భాగ్యకుమారి, కే.విజయశాంతి, జి.రాజేశ్వరి, జి.ఝాన్సీ లక్ష్మీబాయి, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు



తేతలిలో జగనన్న ఆరోగ్య సురక్ష కోసం ఇంటింటికి తిరిగి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు అన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పై అవగాహన సదస్సు పట్టణంలో 10, 12 వార్డులలో నిర్వహించారు. వార్డు ఇంచార్జిలు అడ్డాల నరసింహారావు, చామన సూర్యచంద్రరావులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కర్రి భాస్కరరావు మాట్లాడుతూ వలంటీర్లు, గృహ సారథులు, ఏఎన్‌ఎంలు ప్రతి ఒక్క ఇంటికి వెళ్లి రోగులను గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించే విధంగా చూడాలన్నారు. అక్టోబర్ 10వ తేదీన మెడికల్ క్యాంపులో డాక్టర్లు ద్వారా మరన్ని పరీక్షలు నిర్వహించేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. ఆరోగ్య సురక్ష యాప్‌ను ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆరోగ్య శ్రీ ఆసుపత్రి వివరాలు యాప్ ద్వారా తెలుస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అచ్యుత శ్రీనివాస్, ఆరిమిల్లి రవి, పెనుగొండ ఆంజనేయులు, శివ, ధనకొండ, సెక్రటరీలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

తణుకు టౌన్: ప్రజల ఆరోగ్యంపై ఈనెల 30వ తేదీ నుంచి సచివాలయ పరిధిలో నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి తణుకు మండలంలోని పలు గ్రామాల్లో వైద్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది గ్రామాల్లో ముమ్మరంగా సర్వే చేపట్టారు. మంగళవారం తణుకు మండలంలోని పలు గ్రామ సచివాలయాల పరిధిలో సచివాయల ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు సచివాలయం పరిదిలో ఇంటింటికి తిరిగి కుటుంబంలోని సభ్యులకు బీపీ, సుగర్, ఆర్‌బీఎస్, నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈపరీక్షల ద్వారా లోపాలను గుర్తించి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన పత్రాలను అందజేశారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో సిబ్బంది ఈ సర్వే కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీవో కే కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలో మంగళవారం సాయంత్రానికి 2983 మందికి ఇళ్ల వద్దే ప్రాథమిక పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సమర్థవంతంగా నిర్వహించాలి

ఆరోగ్య సురక్షపై సమీక్ష

పెంటపాడు: ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన అలంపురంలో సచివాలయ సిబ్బంది, ఆరోగ్యసిబ్బందితో ఆయన ఆరోగ్య సురక్షపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు చేసిన సర్వే వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాద్, కార్యదర్శి బేగ్, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



చినపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజలో పాల్గొన్న సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

అత్తిలి: గ్రామ పంచాయతీ నిధులతో గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయిన్‌లు నిర్మిస్తున్నామని సర్పంచ్ గంటావిజేత నాగరాజు చెప్పారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సహకారంతో రూ. 30 లక్షలు పంచాయతీ, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో అత్తిలి గ్రామంలో 17వ వార్డు చినపేటలో ఇంటర్నల్ రోడ్లు, డ్రెయిన్‌లు చేపట్టగా ఇప్పటికే రూ. 23 లక్షలు వ్యయంతో పనులు పూర్తిచేయగా, మరో రూ. 7 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం సర్పంచ్ గంటావిజేత కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీపీ మక్కా సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు వెచ్చిస్తోందన్నారు. గ్రామంలో నూరుశాతం సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు నిర్మించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, బూత్ కన్వీనర్ గారపాటి నాగరాజు, వార్డు సభ్యులు కూసంపూడి పుష్పకుమారి, సేవాదళ్ అధ్యక్షులు కంకటాల సతీష్, స్థానిక సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సామూహిక చర్యలతో సత్ఫలితాలు

తాడేపల్లిగూడెం రూరల్: ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని రైతులంతా సామూహికంగా చేపట్టాలని, తద్వారానే ప్రయోజనం ఉంటుందని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని కడియద్ద, కృష్ణాయపాలెం గ్రామంలో రైతులకు ఎలుకల నిర్మూలన ఎర మందును పంపిణీ చేశారు. కృష్ణాయపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ వరి చిరుపొట్ట దశలో ఎలుకలు ముప్పేట దాడి చేస్తాయన్నారు. వరి కంకులను కొరికి నాశనం చేయడం వల్ల దిగుబడులు తగ్గుతాయన్నారు. ఎలుకల బారి నుంచి పంటను రక్షించుకోవడానికి సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం ఒక్కటే మార్గమన్నారు. మండలంలోని వివిధ సచివాలయాల వద్ద ఎలుకల నిర్మూలన ఎర మందును పంపిణీ చేశారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



జట్లపాలెంలో ఎలుకల నిర్మూలనకు మందు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎలుకల నిర్మూలనకు రైతుల పూర్తి సహకారం అవసరం

పెంటపాడు: సామూహిక ఎలుకల నిర్మూలన ప్రతి రైతు ఒక ఉద్యమంలా చేపట్టి ఎలుకలను నిర్మూలించుకోవాలని వ్యవసాయ సలహామండలి జిల్లా, మండల అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్‌లు పేర్కొన్నారు. జట్లపాలెం సచివాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని రైతులకు ఉచితంగా బ్రొమోడయాల్ మందును నూకలు, నూనె తో కలిపి పొట్లాలుగా చేసి రైతులకు అందించారు. జట్లపాలెం గ్రామంలో మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు కట్టుబోయిన కృష్ణప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండుమోగుల సాంబయ్య, సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, ఉపసర్పంచ్ చెరుకు సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, మండల వ్యవసాయాధికారి కె. పార్థసారథి, వీఆర్వోలు ప్రభువరం, సురేష్, రామకృష్ణలతో పాటు, వీఏఏలు శ్యాంబాబు, శ్వేత, విశ్రాంత ఉపాధ్యాయులు కట్టుబోయిన నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. ఎలుకే కదా అని వదిలేస్తే... బస్తాలకు బస్తాలు ధాన్యం బొక్కేస్తాయని, దిగుబడి తగ్గిపోతుందని పెంటపాడు సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, ప్రత్తిపాడులో వీర్ల గోవింద్, వెంకటేష్, ముదునూరు గ్రామంలో సొసైటీ అధ్యక్షులు బూరాడ శ్రీనివాస్, రావిపాడులో దేవ వెంకటరమణ, సర్పంచ్ పెన్నాడ సూరిబాబు, మీనవిల్లూరులో సర్పంచ్ చింతపల్లి లక్ష్మి, రామచంద్రపురంలో చల్లా కుమారస్వామి, లింగమూర్తి, కొండేపాడులో కట్టా దానయ్య, ఆయా గ్రామాలలో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఎలుకల మందును గ్రామ వీఏఏల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టడం ద్వారా మంచి ఫలితం

అత్తిలి: రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపడితే మంచి ఫలితాలు ఉంటాయని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. అత్తిలి మండలంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల వద్ద సామూహిక ఎలుకల నిర్మూలనలో భాగంగా రైతులకు ఉచితంగా విషపు ఎరను అందజేశారు. ఈసందర్భంగా ఏఓ రాజేష్ మాట్లాడుతూ ఎలుకల నిర్మూలనకు మందును చిన్నచిన్న పొట్లాలుగా చేసి పంపిణీ చేశామన్నారు.

గణేశుని నిమజ్జనాలు



అత్తిలి గోగులమ్మపేటలో వినాయక ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్న యువత

అత్తిలి: మండలంలోని గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అత్తిలి శివారు గోగులమ్మపేటలో నెలకొల్పిన వినాయక విగ్రహాన్ని మంగళవారం ఊరేగింపు చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గణపతి ప్రతిమను ఉంచి, మేళతాళాలు, తీన్‌మార్ డప్పులతో అత్తిలి పురవీధులలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం కాలువలో స్వామివారి ప్రతిమను నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైభవంగా చవితి ఉత్సవాలు

పెంటపాడు: మండలంలో వినాయక చవితి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా పెంటపాడు బజారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని మంగళవారం ఊరేగించారు. వర్తకసంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. జట్లపాలెం గ్రామంలోని గౌడసంఘం ఆధ్వర్యంలో చవితిమహోత్సవాలు పురస్కరించుకొని గ్రామంలో మంగళవారం సాయంత్రం అన్నసమారాధన నిర్వహించారు. పార్టీ నాయకులు కట్టుబోయిన కృష్ణప్రసాద్, సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, ఉపసర్పంచ్ చెరుకు సూర్యనారాయణ, గౌడసంఘ యూత్ సంఘం, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పెంటపాడు మేదర్లసెంటర్‌లోని గణపతిని మంగళవారం గ్రామంలో ఊరేగించి కాలువలో నిమజ్జనం చేశారు.

సమన్వయంతో ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి

తాడేపల్లిగూడెం ఆర్డీవో చెన్నయ్య

తాడేపల్లిగూడెం రూరల్: అధికారులంతా సమన్వయంతో పనిచేసి, ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని తాడేపల్లిగూడెం ఆర్డీవో పి.చెన్నయ్య అన్నారు. మంగళవారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణంపై నియోజకవర్గ స్థాయిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చెన్నయ్య మాట్లాడుతూ తాడేపల్లిగూడెం మండలానికి సంబంధించి పీఎం ఆవాస్‌లో 1900 ఇళ్లు లక్ష్యం కాగా, 855 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. జగనన్న ఇళ్ల పథకానికి 3029 మంజూరు కాగా, ఇప్పటి వరకు 2503 ఇంటి నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. స్థలం ఉండి ఇంటి నిర్మాణాలకు సంబంధించి 2298గాను 944 ఇళ్లు నిర్మించుకున్నట్లు తెలిపారు. పెంటపాడు మండలానికి సంబంధించి పీఎం ఆవాస్ కింద 1,266గాను 771 పూర్తయ్యాయని, స్థలం ఉండి ఇంటి నిర్మాణాలకు 1631 మంజూరు కాగా, 522 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. జగనన్న ఇళ్లు 2313 కాగా, 1246 పూర్తయినట్లు తెలిపారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. హౌసింగ్ ఇన్‌ఛార్జ్ ఈఈ వీఎస్.వేణుగోపాల్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణాలు చేపట్టే ముందుగా ఇంకుడు గుంటలు ఏర్పాటు చేయాలన్నారు. హౌసింగ్ డీఈ కేవీవీఎస్.ప్రసాద్ మాట్లాడుతూ కొత్తగా 779మందికి గృహ స్థల పట్టాలు ఇవ్వడం జరిగిందని, ఇంటి నిర్మాణాలకు దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలని సూచించారు. అధికారులు లబ్ధిదారులను ప్రోత్సహించి ఇంటి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా మిగిలి ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఇంటి నిర్మాణాలను దశల వారీగా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం.వెంకటేష్, పెంటపాడు ఎంపీడీవో బాలాజీ, హౌసింగ్ ఏఈలు వైవి.వెంకట్రావు, బీ.రాజేంద్ర, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు కే.నాగేశ్వరరావు, కే.జయరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎన్ఆర్ఈజీసీ ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గృహ నిర్మాణ శాఖ సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీవో చెన్నయ్య

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపాలి



ఆటల పోటీలలో పాల్గొన్న దివ్యాంగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపేలా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని ఐదో వార్డు ఇంచార్జి కాకర్ల శ్రీను అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు మండల స్థాయి ఆటల పోటీలు మంగళవారం స్థానిక సుబ్బారావు పేట భవిత దివ్యాంగుల పాఠశాలలో జరిగాయి. పరుగు పందెం, తదితర ఆటలను ఆడించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య మాట్లాడుతూ మండల స్థాయి గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయిలో పంపిస్తామని తెలిపారు. గెలుపొందిన వారికి సమగ్ర శిక్ష వారి ఆధ్వర్యంలో బహుమతులు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని కె.కుమారి, ప్రత్యేక ఉపాధ్యాయిని ఎం.చంద్రకుమారి, బి.నాగలక్ష్మి, దివ్యాంగుల పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

పెంటపాడు: మండలంలోని పెంటపాడు గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని బాలవెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 10 వేల మంది అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, బర్ల జయరాంబాబు, బండారు రాంబాబు ఏవీఎస్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పెంటపాడు: మండలంలోని జట్లపాలెం పంటపొలాల్లో పేకాట శిబిరాలపై పెంటపాడు పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 5 గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద రూ. 9100 స్వాధీనం చేసుకొన్నామని ఎస్సై డి. హరికృష్ణ తెలిపారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



పెంటపాడులో పౌష్టికాహార మాసోత్సవాల ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఐసీడీఎస్ సిబ్బంది



తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెం గ్రామంలో పోషకాహార మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ చిరుధాన్యాలైన మినుములు, రాగులు, సజ్జలు, పెసలు వంటి వాటిలో ఎన్నో పోషకాలు ఉన్నాయని, గర్భవతులు ఆహారంలో తీసుకోవాలన్నారు. తద్వారా గర్భస్థ శిశువు బలవర్ధకంగా పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి

పెంటపాడులో పోషణ మాసోత్సవాలు

పెంటపాడు: ప్రభుత్వం తల్లీ బిడ్డల ఆరోగ్యం కోసం ప్రవేశపెడుతున్న పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెంటపాడు గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ పేర్కొన్నారు. మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జీజీబీ విజయలక్ష్మి, దుర్గాభవాని, ఎం.సుజాత ఆధ్వర్యంలో పెంటపాడులో పౌష్టికాహార మాసోత్సవాల ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సర్పంచ్ సూర్యకళ, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సుజాతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ విద్యార్థుల కోసం, తల్లీబిడ్డల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పలు పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కిషోర్‌బాలికల ద్వారా రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆకుకూరల వాడకం, ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన చర్యలు వివరించారు.

తల్లి బిడ్డల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

తణుకు టౌన్: తల్లీ బిడ్డ ఆరోగ్యం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి చెప్పారు. తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పైడిపర్రు సెక్టార్ ఆధ్వర్యంలో తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో నిర్వహించిన పోషణ్ మహా మాసోత్సవాలలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అడ్డాబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ అన్నపూర్ణదేవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో పోషకాహారం తయారు చేసుకునేలా అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ రుద్ర ధనరాజు మాట్లాడుతూ గ్రామాల్లో ఐసీడీఎస్ సిబ్బంది చేస్తున్న సేవలు స్థానిక నాయకులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎంబీఎస్ ప్రమోదినికుమారి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్ వెంకటలక్ష్మీ, గ్రామ ఉప సర్పంచ్ కడియం వీరబాబు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎస్ గోపాల కృష్ణ, నాయకులు దండు కృష్ణంరాజు, సెక్టార్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.